మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం


మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే రమేష్


మొక్క అందజేస్తున్న మేయర్ సుధారాణి


పుష్పగుచ్ఛం అందిస్తున్న మార్నేని, తదితరులు


మంత్రికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్లు


పుష్పగుచ్ఛం అందిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

హసన్‌పర్తి: మంత్రి హరీశ్‌రావుకు హసన్‌పర్తిలో ఘన స్వాగతం పలికారు. సిద్దిపేట నుంచి హనుమకొండకు వస్తున్న క్రమంలో మార్గమధ్యలోని హసన్‌పర్తిలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేణుకుంట్ల సునీత, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

వరంగల్ అర్బన్: నగరంలో పలు కార్యక్రమాల ప్రారంభం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలనకు బుధవారం విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును నగర మేయర్ గుండు సుధారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి మొక్క అందజేశారు.

హన్మకొండ: మంత్రి హరీశ్‌రావుకు వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు పుష్పగుచ్ఛం అందించారు.

మంత్రికి స్వాగతం పలికిన వరంగల్ కలెక్టర్

కరీమాబాద్: మంత్రి హరీశ్‌రావుకు హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య మొక్క, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు.

మంత్రిని కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

హన్మకొండ అర్బన్: మంత్రి హరీశ్‌రావుతోపాటు మంత్రి దయాకర్‌రావును టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో కేఎంసీలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. ఈమేరకు హనుమకొండ పర్యటనకు వచ్చిన మంత్రి హరీశ్‌రావుకు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఈదురు వెంకన్న, వరంగల్ రీజియన్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ బుధవారం వినతి పత్రం అందించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని, సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతన సవరణ 50శాతం పేస్కేల్ ఏరియర్స్ చెల్లించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవీందర్, వీసీ.కుమార్, టి.శ్రీనివాస్, ఎల్లయ్య, బి.రఘుపతి, భద్రయ్య పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ కుక్టా జేఏసీ నాయకుడు డాక్టర్ సాధు రాజేష్, బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండలో మంత్రి హరీశ్‌రావుకు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాధ్యులు డాక్టర్ సతీష్, డాక్టర్ మామిడాల లింగయ్య, డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ అరూరి సూర్యం పాల్గొన్నారు. అలాగే, కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని మంత్రిని కేయూ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ కుమార్‌లోధ్ కోరారు.

డిజిటల్, సైబర్ నేరాలపై అవగాహన


మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రావు

హన్మకొండ కల్చరల్: వరంగల్ జిల్లా సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో నెలవారీ సమావేశంలో భాగంగా డిజిటల్, సైబర్ నేరాలపై హనుమకొండలోని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ భవనంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అనసూరి చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథులుగా టీజీఓఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, జనరల్ సెక్రటరీ ప్రవీణ్, జాయింట్ సెక్రటరీ రాజేష్ పాల్గొని మాట్లాడారు. ఆస్థాన తెలుగు కవిగా డాక్టర్ పల్లేరు వీరస్వామి, బహుభాషా కవిగా మహ్మద్ సిరాజుద్దీన్, గాయకుడిగా రామమూర్తి, సంగీత విద్యాంసులుగా జగన్నాథచార్యులను ఎన్నుకుని సన్మానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన హెల్పేజ్ ఇండియా సంస్థ సభ్యుడు శ్యామ్‌కుమార్.. డిజిటల్ సేఫ్టీపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. హనుమకొండ సుబేదారి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షుకుర్, డిజిటల్, సైబర్ నేరాలపై జాగ్రత్తలు వివరించారు.

క్లుప్తంగా

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: హనుమకొండలోని కొన్ని కాలనీలు, కాజీపేటకు గురువారం తాగునీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ పరిధిలో కాజీపేట మీదుగా వెళ్తున్న 900ఎంఎం డయా పైపులైన్‌కు బుధవారం లీకేజీ ఏర్పడిందని పేర్కొన్నారు. పైపులైన్‌కు మరమ్మతుల దృష్ట్యా తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కేయూలో రేపు జెండావిష్కరణ

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలో జూన్ 2న ఉదయం 8గంటలకు వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం సెనెట్‌హాల్‌లో జరగనున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో బోధన, బోధనేతర సిబ్బంది హాజరు కావాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు సర్క్యులర్ జారీ చేశారు.

బ్యాడ్మింటన్ డబుల్స్‌లో మెడల్స్



వరంగల్ అర్బన్: సీఎం కప్ రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీల్లో వరంగల్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ తీసుకున్న బ్యాడ్మింటన్ క్రీడాకారులు సత్తా చాటారు. హైదరాబాద్‌లో జరిగిన క్రీడల్లో మహిళా విభాగం డబుల్స్‌లో రితిన్, పూజ సిల్వర్ మెడల్స్ దక్కించుకున్నారు. పురుషుల విభాగంలో సింగిల్స్‌లో బి.రిత్విన్ బ్రాంజ్ మెడల్ అందుకున్నాడు. ఈ సందర్భంగా వారిని ఇండోర్ స్టేడియం కోచ్ శ్రీధర్, తదితరులు అభినందించారు.

ప్రతిభకు డాక్టరేట్



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ వడ్డేపల్లిలోని పింగళి ప్రభుత్వ కళాశాల అధ్యాపకురాలు పుల్లూరి ప్రతిభకు అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని హిమాలయన్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది. డాక్టర్ మనీష్ సక్సేనా పర్యవేక్షణలో 'యూజెస్ ఆఫ్ మెషిన్ లెర్నింగ్ ఇన్ ద డయాగ్నసిస్ ఆఫ్ హార్ట్ ఎల్‌మేట్స్' అనే అంశంపై ప్రతిభ చేసిన పరిశోధనకు డాక్టరేట్ పట్టాను యూనివర్సిటీ ప్రదానం చేసింది. వరంగల్‌లోని మట్టెవాడకు చెందిన ప్రతిభ.. కొన్నేళ్లుగా పింగళి కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉచిత శిక్షణ

న్యూశాయంపేట: ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు తిరిగి పరీక్షల్లో ప్రతిభ కనబరిచేందుకు వారికి పదిరోజుల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు స్టూడెంట్ ఇస్లామిక్ ఇండియా ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా పబ్లిక్ రిలేషన్ సెక్రటరీ సయ్యద్ జుబేర్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జకోటియా కాంప్లెక్స్‌లోని ఐక్యూ అకాడమీలో పదిరోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 79954 41842 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా బన్న ప్రభాకర్



మామునూరు: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఖిలా వరంగల్ మండలం నక్కలపెల్లి గ్రామానికి చెందిన బన్న ప్రభాకర్ నియమితులయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఇన్‌చార్జ్ కొల్లార్ పార్లమెంట్ సభ్యుడు మునిస్వామి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రబారి గొంగిడి మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని బుధవారం అందుకున్నారు.

వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా సమీర్

న్యూశాయంపేట: సమాచార హక్కు పరిరక్షణ చట్టం సొసైటీ వరంగల్ మండల అధ్యక్షుడిగా మహమ్మద్ సమీర్ అహ్మద్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు బర్ల శ్రవణ్ తెలిపారు. ఈమేరకు ఆయనకు నియామక పత్రాన్ని బుధవారం అందజేశారు. తన నియామకానికి సహకరించిన వారికి సమీర్ కృతజ్ఞతలు తెలిపారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

కాశిబుగ్గ: అదనపు వరకట్న వేధింపులతో ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాశిబుగ్గలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇంతేజార్‌గంజ్ ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం కీర్తినగర్‌కు చెందిన గొర్రె కావ్య (20)కు లక్ష్మీపురానికి చెందిన భూషణ్‌తో ఏడాది క్రితం వివాహం జరిగింది. ఈక్రమంలో అదనపు కట్నం కోసం భర్త భూషణ్, అత్తమామలు శాంతమ్మ, దేవరాజు వేధింపులకు గురిచేయగా ఇంట్లో ఫ్యాన్‌కు కావ్య ఉరివేసుకొని బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి పోలెపాక భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దశాబ్ది సంబరాలు అంబరాన్నంటాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సంబరాలు అంబరాన్నంటాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని సూచించారు. ఎంపీపీ కేతపాక సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, జెడ్పీటీసీ సభ్యురాలు రేనుకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ విజయ్, మార్కెట్ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్లు జక్కు రమేష్, గోపాల్‌రెడ్డి, మేర్గు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



కేయూ క్యాంపస్: నిజాయితీ, నిబద్ధతత, అంకితభావం.. ఉద్యోగి పనితనానికి గీటురాయి వారికే తగిన గుర్తింపు లభిస్తుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో తెలుగు విభాగం ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు, కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ మధుకర్, నాన్ టీచింగ్ ఉద్యోగులు యాకయ్య, అయిలయ్య, మజీద్ ఉన్నీస్‌బేగ్, సమ్మయ్య ఉద్యోగ విరమణ పొందారు. కాగా, వారిని పరిపాలన భవనంలోని సెనెట్‌హాల్‌లో వీసీ రమేష్‌తో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, నవీన్, రాజేశ్వర్, పలు సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సహజం

హసన్‌పర్తి: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. కళాశాలలో 40ఏళ్ల పాటు ప్లంబర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఇప్పలపెల్లి రాజ్‌కుమార్‌ను బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోమల్‌రెడ్డి, ఏట ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి, డీన్ ప్రొఫెసర్ సుధీర్‌రెడ్డి, ప్రొఫెసర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో అనర్థాలు


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రేరణ సంస్థ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: పొగతాగడం ఫ్యాషన్‌గా భావించి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, ఈక్రమంలో పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలని యువతకు సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ సూచించారు. 'నో టుబాకో డే' సందర్భంగా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో కరపత్రాలను బుధవారం పంపిణీ చేశారు. పొగాకు ఉత్పత్తులతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ పొగ తాగే వారితో పాటు పక్కన ఉండే వారికి సైతం క్యాన్సర్ సోకే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పెండ్లి ఉపేందర్‌రెడ్డి, సాగంటి మంజుల, కృష్ణమోహన్, ప్రవీణ, జ్యోతి, కరుణ పాల్గొన్నారు.

సీపీ రంగనాథ్‌కు కృతజ్ఞతలు


సీపీకి కృతజ్ఞతలు తెలుపుతున్న కాలనీవాసులు

వరంగల్ క్రైం: ఖాళీ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తూ భూ ఆక్రమణకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి బాధితులకు సత్వర న్యాయం చేసినందుకు అశోకకాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను బుధవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక కాలనీలో ఒకే ప్రాంతంలో 20 మంది వ్యక్తులు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఈక్రమంలో ఇదే ప్రాంతానికి చెందిన కేశబోయిన శివ, కేలోతు నవీన్ వచ్చి ఆ స్థలంలో జరుగుతున్న నిర్మాణ పనులను నిలిపివేసి ఆ భూములు తమవేనని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో బాధితులు సీపీకి ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన అనంతరం ఆ స్థలం ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులదేనని నిర్ధారణ అయింది. అలాగే, ఇద్దరు భూ ఆక్రమణదారులపై సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. దాంతో సీపీకి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా దశాబ్ది ఉత్సవాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి, పక్కన కలెక్టర్

హన్మకొండ: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకుందామని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో దశాబ్ది ఉత్సవాల పరకాల నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలు పల్లెపల్లెనా పండుగలా నిర్వహించాలని, గ్రామ సభలు పెట్టి ప్రగతిని వివరించాలన్నారు. పోలీసు కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు పోలీస్ శాఖ తరఫున పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంతం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

క్షేత్రస్థాయిలో కమిషనర్ తనిఖీలు


హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్

వరంగల్ అర్బన్: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, డివైడర్ల వెంట మొక్కల పెంపకం, నల్లాల నుంచి నీటి సరఫరా తీరుపై గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా బుధవారం అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్ రోడ్డులోని ఎల్లాపూర్ రోడ్డు నుంచి హసన్ పర్తి వరకు, నయీంనగర్, పబ్లిక్ గార్డెన్ మీదుగా హంటర్ రోడ్డు, కేఎంసీ వరకు సెంట్రల్ మీడియన్స్‌లో మొక్కలకు నీటి సరఫరా, పెంపకం తీరు, సుందరీకరణను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మొక్కలకు రోజూ నీరందించాలని, ఎండిపోతే చర్యలు తప్పవని సీఎంహెచ్‌ఓ మాధవరెడ్డిని ఆదేశించారు. ట్యాంకర్లు, సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. హన్మకొండ అడ్వొకేట్స్ కాలనీలో ఇంటింటా తడి, పొడిచెత్త సేకరణ ఎలా జరుగుతోంది, రోజూ నీటి సరఫరా అవుతోందా అని ఆరా తీశారు. హంటర్‌రోడ్డులో టీఎస్–బీపాస్ ద్వారా అందిన భవన నిర్మాణ దరఖాస్తులు, ప్లాన్‌లు, ఎన్‌టీసీలు, స్థలాన్ని పరిశీలించారు. పోతననగర్ సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో మొక్కలు విరివిగా పెంచాలని సూచించారు. కమిషనర్ వెంట అడిషనల్ కమిషనర్ రవీందర్‌యాదవ్, సిటీ ప్లానర్ వెంకన్న, సీఎంహెచ్‌ఓ రాజేష్, డిప్యూటీ కమిషనర్లు జోనా, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జ్యోతిబసునగర్‌లో అనేక సమస్యలు


మురుగునీటిని చూపుతున్న సీపీఎం నాయకులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 4వ డివిజన్ పరిధిలోని జ్యోతిబసునగర్ ఫేస్–2 కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం హనుమకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. పార్టీ ఉత్తర మండల కమిటీ ఆధ్వర్యంలో కాలనీలోని సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు నివసించే కాలనీలో అస్తవ్యస్తమైన డ్రెయినేజీ వ్యవస్థతో మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దోమల బెడద అధికమై ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని వాపోయారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి జ్యోతిబసునగర్ –ఫేస్2లో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నార్త్ కమిటీ కార్యదర్శి గాదె రమేష్, భాస్కర్, నవీన్, శంకర్, విజయ, మానస, తార పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

అనసూయ మరణం కలచివేసింది

విద్యారణ్యపురి: 'నా సహచరిణి (భార్య) అనసూయ మరణం నన్ను ఎంతగానో కలచివేస్తోంది. రాబోయే రోజుల్లో ధైర్యాన్ని కూడగట్టుకొని వ్యాసాంగాన్ని పుస్తక రచనలను యథావిధిగా కొనసాగిస్తా' అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ తెలిపారు. అంపశయ్య నవీన్ భార్య అనుసూయ ఇటీవల మరణించిన విషయం విదితమే. హనుమకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన అనుసూయ సంస్మరణ సభలో కుటుంబ సభ్యులు, బంధువులు, కవులు, రచయితలు, సాహితీవేత్తలు, తదితరులు పాల్గొని అనుసూయ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

వెంపటి నాగేశ్వరి చిరస్మరణీయురాలు

హన్మకొండ కల్చరల్: ఓరుగల్లులో వందలాది మందికి నాట్యంలో శిక్షణ ఇచ్చి శాస్త్రీయ నృత్య కళాకారులను అందించిన నృత్యగురువు డాక్టర్ వెంపటి నాగేశ్వరి చిరస్మరణీయురాలని వరంగల్ రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య కొనియాడారు. వరంగల్‌కు చెందిన నృత్యగురువు నాగేశ్వరి తొమ్మిదవ వర్ధంతిని పురస్కరించుకుని వరంగల్‌లోని వెంపటి నాగేశ్వరి నృత్యకళాక్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన నటులు, కళాకారులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రిటైర్డ్ ఐపీఎస్ నాగరాజుకు సన్మానం

హన్మకొండ: మాల ఎంప్లాయీస్, ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కె.ఆర్.నాగరాజును సన్మానించారు. హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో బుధవారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిస్కం అధ్యక్షుడు ఎ.ఆనందం పాల్గొని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కె.ఆర్.నాగరాజుకు శాలువా కప్పి జ్ఞాపిక అందించి గజమాలతో సన్మానించారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కాశిబుగ్గ: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పలు డివిజన్ల నుంచి నాయకులు బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు 18వ డివిజన్ ప్రతాప్‌నగర్‌లో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో వారికి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, నల్గొండ రమేష్, కొత్తపల్లి శ్రీనువాస్, ఐత అరుణ్‌కుమార్, రేణుకుంట్ల శివకుమార్, కూచన రవిందర్, సందెల లాజర్, గిరి పుష్ప, సునీత, జన్ను అరవింద్, చిప్ప వెంకటేశ్వర్లు, దాసరి రాజేష్, నారగోని మురళి, స్వప్న తదితరులు ఉన్నారు.

రెడ్డి సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

నయీంనగర్: మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో గురువారం నిర్వహించనున్న రెడ్డి కులస్తుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడగా, సమావేశంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, బిల్ల సుధీర్‌రెడ్డి, రావు అమరేందర్ రెడ్డి, రెంటాల కేశవరెడ్డి, గుర్రాల ప్రభాకర్‌రెడ్డి, రాదారపు సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

హసన్‌పర్తి: మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో గురువారం జరగనున్న రెడ్డి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని రెడ్డి సంఘం నాయకులు కోరారు. ఈమేరకు వాల్‌పోస్టర్లను గోపాలపురంలోని మాధవనగర్‌కాలనీలో ఆవిష్కరించారు.

పీవైఎల్ మహాసభలను జయప్రదం చేయండి

ఖిలా వరంగల్: ఈనెల 5, 6 తేదీల్లో ఖమ్మం పట్టణంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జరగనున్న ప్రగతిశీల యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభలను జయప్రదం చేయాలని పీవైఎల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బండి కోటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ గవిచర్ల రోడ్డులో బుధవారం జరిగిన సమావేశంలో పీవైఎల్ నాయకులతో కలిసి మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

ఆలయ సింహద్వార ప్రతిష్ఠాపన

వరంగల్: వరంగల్ ఎస్ఆర్‌నగర్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయం సింహద్వారా ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ హాజరై పూజలు నిర్వహించారు.

4న ఎంసీపీఐ (యూ) బహిరంగ సభ

వరంగల్ చౌరస్తా: వరంగల్ జిల్లాలోని నర్సంపేట జూన్ 4నుంచి 6వ తేదీ వరకు ఎంసీపీఐ(యూ) భారీ ప్రదర్శన – బహిరంగ సభ, రాష్ట్ర ప్లీనరీలు జరుగుతాయని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ తెలిపారు. ఈమేరకు వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో వాల్‌పోస్టర్లను పార్టీ నాయకులు బుధవారం ఆవిష్కరించారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

ఖిలా వరంగల్: 41వ డివిజన్‌లో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ పోశాల పద్మ తెలిపారు. వరంగల్ శంభునిపేటలో రూ.12లక్షల వ్యయం చేపట్టినతో సీసీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. జిజ్ఞాస స్కూల్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు పనులను ప్రారంభించినట్లు వివరించారు.

కార్మిక యుద్ధభేరికి తరలిన నాయకులు


సభకు బయలుదేరుతున్న రజక సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: నగరంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో బుధవారం సాయంత్రం జరిగిన కార్మిక యుద్ధభేరి బహిరంగ సభకు వడ్డేపల్లిలోని కాకతీయ లాండ్రీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రజక సంఘాల నాయకులు, రజక కులస్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కాకతీయ లాండ్రీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి కనకయ్య, ఎదులాపురం కుమార్, గౌరవ అధ్యక్షుడు ఎదులాపురం కుమారస్వామి, ఉపాధ్యక్షుడు ఎదులాపురం అయిలయ్య, కార్యదర్శులు కత్తెరపెల్లి కుమార్, ముప్పు రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్ నుంచి..

కాజీపేట రూరల్: సుబేదారి ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం ఆవరణంలో బుధవారం జరిగిన కార్మిక యుద్ధభేరి బహిరంగ సభకు కాజీపేట జంక్షన్‌లోని ప్రతాపరుద్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పలువురు ఆటో డ్రైవర్లు తరలివెళ్లినట్లు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం నరహరి, నాతి సత్యనారాయణ తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నయీంనగర్: జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో అల్లం నారాయణ నేతృత్వంలో ప్రారంభమైన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఆవిర్భవించి 23 ఏళ్లు నిండిన సందర్భంగా హనుమకొండలో సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, నాయకపు సుభాష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.